క్లుప్తంగా

రేగిడిలో 'పల్స్ పోలియో'



ఏవీపురంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ అప్పలనరసమ్మ

రేగిడి: మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఏవీపురంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, చిన్న శిర్లాంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, బూరాడలో వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, వైద్యాధికారి చలం, రేగిడి, సంకిలిలో వైద్యాధికారి అసిరినాయుడులు చిన్నారుల నోట్లో పోలియో చుక్కలు వేశారు. నిండు జీవితానికి రెండు చుక్కలు అని, పోలియో చుక్కలు వేసుకుంటే జీవితంలో పోలియో రాదని వారు తెలిపారు. పోలియో రహిత సమాజానికి ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న సత్యసాయి భక్తులు

రేగిడి: వైద్య తనిఖీల నిమిత్తం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోమవారం విచ్చేసిన 70 మంది గర్భిణులకు రేగిడి సత్యసాయి భజన మండలి సభ్యులు అన్నదానం చేశారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతినెలా ఆస్పత్రికి తనిఖీలకు వస్తున్న గర్భిణులకు ఇలా పౌష్టికాహారం అందిస్తున్నామని భక్తులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ షేక్ శంకర్

వంగర: మండలంలోని కె.కొత్తవలస జంక్షన్ వద్ద పోలీసులు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి లైసెన్స్, వాహన ధ్రువపత్రాలను పరిశీలించి, అవేవీ లేని వారికి అపరాధ రుసుం విధించారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలన్నీ వెంట తీసుకురావాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, పరిమిత వేగంతో ప్రయాణించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యంతాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపొద్దన్నారు.

రెండు పూటలా పనులు చేయాలి



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు

రేగిడి: రెండు పూటలా ఉపాధి హామీ పథకం పనులు చేయాలని ఏపీవో ఎస్.హరనాథరావు సూచించారు. మండలంలోని బూరాడ గ్రామంలో మద్దిలవాని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన సోమవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలని, పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని సిబ్బందికి తెలిపారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ భాస్కరరావు

రేగిడి: విద్యార్థులంతా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏఎస్ఐ ఎస్.భాస్కరరావు సూచించారు. మండలంలోని లింగాలవలస గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై సోమవారం అవగాహన కల్పించారు. మద్యం, సిగరెట్ తాగడం, దొంగతనాలు చేయడం, సైబర్ నేరాలకు పాల్పడడం వంటివి చేయకూడదన్నారు. మంచి నడవడికను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దాసరి కృష్ణారావు, ఎంపీపీ పాఠశాల హెచ్ఎం వంజరాపు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రుచి, శుచి కలిగిన భోజనాలు పెట్టాలి

తెర్లాం: మధ్యాహ్న భోజన పథకం అమలులో మెనూ పక్కాగా పాటించాలని, విద్యార్థులకు రుచి, శుచికరమైన భోజనాలు పెట్టాలని ఎంఈవో జె.త్రినాథరావు సూచించారు. స్థానిక రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. భోజన పథకంలో మెనూ సక్రమంగా అమలు చేయకపోతే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. ప్రతిరోజూ మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూసి పరిశీలించాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

ఆల్బెండజోల్‌తో.. నులిపేద్దాం!



రామభద్రపురం పాఠశాలలో విద్యార్థులతో అల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న ఎంపీడీవో రత్నం, వైద్యుడు దిలీప్‌కుమార్

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ సోమవారం చేపట్టారు. రక్తహీనత, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి ఇబ్బందులు నులిపురుగుల వల్ల పడుతుంటారని, రెండేళ్ల వయసు దాటి 19 ఏళ్లలోపు వారందరితో ఈ నులిపురుగు నివారణ మాత్రలు వేయించాలని వైద్యులు సూచించారు. మధ్యాహ్న భోజనం చేసిన అరగంట తర్వాత ఈ మాత్రలు వేసుకోవాలని, ఈ నెల 17వ తేదీన మరోసారి మాత్రల పంపిణీ ఉంటుందన్నారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



తెర్లాం హైస్కూల్‌లో విద్యార్థి నోట్లో ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఎంపీడీవో రాంబాబు



రాజాం: బొద్దాం పాఠశాలలో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న డాక్టర్ సిద్ధేశ్వరి



బొబ్బిలిరూరల్: పక్కి పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రవికుమార్



వంగర: అరసాడ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



సంతకవిటి ఉన్నత పాఠశాలలో విద్యార్థితో మాత్ర వేయిస్తున్న వైద్యుడు నాగేంద్రప్రసాద్, ఎంపీడీవో సురేష్‌కుమార్

• పరామర్శ

రాజాం: మాజీ సర్పంచ్ తలచింతల పైడియ్య మాస్టారు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ రాజాంలోని ఆయన స్వగృహానికి సోమవారం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ పరంగా అండగా ఉంటామని ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, కంబాల సుదర్శనరావు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాజీ ఎంపీపీ కొల్ల అప్పలనాయుడు తండ్రి కొల్ల సూర్యనారాయణ ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావులు మామిడిపల్లి గ్రామంలోని ఆయన ఇంటికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. అనంతరం సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో వంగర ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాల్‌నాయుడు, రాజాం జెడ్పీటీసీ బండి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



సంతకవిటి: సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ తలే రాజేష్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

బొబ్బిలి: స్థానిక కోటలో మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన కెల్ల శంకరరావుకు మంజూరైన రూ.37,100 సీఎంఆర్‌ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కును ఎమ్మెల్యే బేబీనాయన సోమవారం అందజేశారు. అనారోగ్యానికి గురైన శంకరరావు వైద్యసేవల నిమిత్తం ఆర్థికసాయం కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా, ఆ నిధులు ఇప్పుడు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లిలో శివాలయం నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. త్వరితగతిన నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకుంటామని గ్రామపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం

బొబ్బిలి రూరల్: మండలంలోని మెట్టవలస ఉంగట్ల వీధిలో వాలీబాల్ టోర్నీ సోమవారం ప్రారంభమైంది. అరసాడ వాసు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, సర్పంచ్ పువ్వల మాధవరావులు బాల్ సర్వీసు చేసి, పోటీలు ఆరంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో మొత్తం 30 జట్లు తలపడనున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రయోగ పరీక్షలు ప్రారంభం

బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ప్రయోగ పరీక్షలు సోమవారం ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్, పరీక్షల చీఫ్ కె.విజయకుమారి తెలిపారు. మొత్తం 226 మంది విద్యార్థులు ఈ నెల 15వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు రెండు పూటలా హాజరుకానున్నారన్నారు.

రైతులకు గుర్తింపుకార్డులు

బాడంగి: రైతులకు గుర్తింపు కార్డుల నిమిత్తం మండలంలోని పాల్తేరు గ్రామంలో సోమవారం చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏవో కె.శిరీష పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రతీ రైతు గుర్తింపు కార్డు కోసం పేర్లు నమోదు చేసుకోవాలని, గుర్తింపుకార్డు ఉంటే ప్రభుత్వ పథకాలు, సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, విత్తనాలు లభిస్తాయన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈ నెల 11 నుంచి 22వ తేదీ వరకు సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీల బృందంతో సోమవారం సమావేశమైన ఆయన.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, వాటికి అయ్యే ఖర్చులపై ఆడిట్ చేయడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, మొత్తం 1351 పనులకు గాను రూ.14,53,08,884 లు, పంచాయతీరాజ్ పనులకు సంబంధించి 32 పనులకు గాను రూ. 2,12,33,229 లు, హౌసింగ్‌కు సంబంధించి 56 పనులకు గాను రూ.15,177లు ఖర్చు అయ్యాయన్నారు. మండలం మొత్తం 1439 పనులు జరగగా వీటికి రూ. 17,80,18,319లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఈ పనులు, ఖర్చు మొత్తానికి సంబంధించి గ్రామాల వారీగా ఆడిట్ చేయడం జరగనుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో కె.సాయిరాం, ఎస్ఆర్‌పీ మన్మథరావు, డీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి

తెర్లాం: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంఈవోలు జె.త్రినాథరావు, ఆర్.పాపారావు సూచించారు. మండలంలోని కొరటాం ప్రాథమిక పాఠశాలను వారు సోమవారం సందర్శించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, విద్యార్థుల చేతిరాత, హోంవర్కు పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం, మరుగుదొడ్లు, తాగునీటి వనరులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని తెలిపారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని స్కావెంజర్స్‌ను ఆదేశించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలు చేయాలని తెలిపారు.



విద్యార్థి అభ్యసన సామర్థ్యం పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాథరావు

అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయండి

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో నెట్‌వర్క్ ప్లాన్‌ల జాబితా సోమవారం ప్రదర్శించారు. రోడ్ల వెడల్పు, జన సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా పట్టణ ప్రణాళికా విభాగం సంచాలకుల ఆదేశాలతో కొత్తగా సర్క్యులేషన్ నెట్‌వర్క్ ప్లాన్‌లను విడుదల చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు. మున్సిపాలిటీలోని 16 సచివాలయాల పరిధిలో 16 నెట్‌వర్క్ ప్లాన్‌లకు గాను 12 ప్లాన్‌లు ఆమోదం పొందినట్లు పేర్కొన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఏడు రోజుల్లో మున్సిపల్ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు.

కలెక్టర్‌కు సర్పంచ్‌ల వినతి

విజయనగరం అర్బన్: మెంటాడ మండలం, పెద చామలపల్లి గ్రామ పంచాయతీ నిధుల వినియోగంపై వచ్చిన ఆరోపణలకు సర్పంచ్ ఇచ్చిన సంజాయిషీ నివేదికను ఆమోదించాలని ఆ మండలానికి చెందిన పలువురు సర్పంచ్‌లు కోరారు. ఇదే విషయమై వారంతా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు సోమవారం వెళ్లి, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. పంచాయతీరాజ్ చట్టం హక్కుల ద్వారా నాలుగేళ్లుగా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ విస్తరణాధికారి నుంచి డివిజన్ పంచాయతీ అధికారి వరకు పరిశీలించిన రికార్డులల్లో ఎటువంటి నిధుల దుర్వినియోగం జరగలేదనే రుజువులున్నాయన్నారు. గ్రామంలోని అధికార పార్టీ కార్యకర్తలు ఇచ్చిన ఫిర్యాదులో నిజం లేదన్నారు. ఫిర్యాదు వచ్చిన తర్వాత డీఎల్‌పీవో విచారణలో నిధుల దుర్వినియోగం జరగలేదని తేలిందన్నారు. తాజాగా ఆర్డీవో ద్వారా చేపట్టిన విచారణకు సర్పంచ్‌కు గానీ వార్డు సభ్యులకు గానీ ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఒకరిద్దరి ప్రమేయంతో విచారణ ముగించారని ఆరోపించారు. గ్రామ పంచాయితీ చెక్ పవర్ రద్దు చేయాలని ఇదంతా కేవలం రాజకీయ కక్షతో కొందరు చేస్తున్న కుట్రగా గుర్తించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మెంటాడ మండల ఎంపీపీ ఆర్. సన్యాసినాయుడు, జెడ్పీటీసీ ఎల్.సన్యాసప్పలనాయుడు, వైఎస్ ఎంపీపీ ఈశ్వరరావు, 13 గ్రామాల సర్పంచ్‌లు ఉన్నారు.



వినతిపత్రం చూపిస్తున్న సర్పంచ్‌లు

మిగులు స్థలాలపై సర్వే చేయండి

బొబ్బిలిరూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌వోలతో తహసీల్దారు ఎం.శ్రీను సోమవారం సమావేశమయ్యారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు జగనన్న కాలనీలో ఇచ్చిన ఇళ్లస్థలాల్లో మిగులు స్థలాలపై సర్వే చేయాలని సూచించారు. ఆక్రమణదారులున్నా, తప్పుడు పట్టాలున్నా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ఐ కొల్లి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోవాలి

బొబ్బిలి: పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. స్థానిక పట్టణంలోని తన కార్యాలయంలో మెప్మా ఆర్‌పీలతో సోమవారం సమావేశమైన ఆమె.. సోలార్ ప్యానెళ్లు కావాల్సిన వారి పేర్లను నమోదు చేయాలని సూచించారు. కనీసం 100 అడుగుల శ్లాబు ఉన్న ఇళ్లకు ప్రభుత్వ సబ్సిడీతో పాటు బ్యాంకు రుణం కూడా అందించడం జరుగుతుందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే ప్రతీ మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

వీడని పొగమంచు



పొగమంచు వీడడం లేదు. రాత్రి 10 గంటల నుంచే కురవడం ఆరంభమైన మంచు ఉదయం 10 గంటల వరకు ఏకధాటిగా కురుస్తోంది. దట్టమైన పొగమంచు కారణంగా ఎక్కడ ఏం ఉందో కానరావడం లేదు. దగ్గరకు వెళ్తే తప్ప అక్కడున్నది గుర్తించని పరిస్థితి. ఈ నేపథ్యంలో అవసరమైతే తప్ప ఎవరూ బయటకు వెళ్లడం లేదు. ఒకవేళ వెళ్లినా లైట్లు వేసుకుని మరీ వెళ్లాల్సి వస్తోందని జనం అంటున్నారు. ఈ చిత్రంలోని మంచు దృశ్యం రేగిడి మండలం, వన్నలి గ్రామంలోనిది.. – రేగిడి

ఆర్భాటమేనా.. కొనుగోళ్లు లేవా?



చివరి గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు లక్ష్యం పూర్తయిందని ధాన్యం కొనుగోళ్లను నిలిపివేసింది. దీంతో కొన్ని గ్రామాల్లో పొలాల్లోని వరికుప్పలు అలానే ఉండిపోయాయి. రేగిడి మండలంలోని ఖండ్యాం, దేవుదళ, లక్ష్మీపురం, కొమెర తదితర గ్రామాల రైతులు ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. రబీ సీజన్‌లో వేసిన అపరాల పంటలు పాడవ్వకూడదని, పొలాల్లో నూర్పిడి పనులు చేయలేదని, ఇప్పుడు నూర్పిడి చేసిన ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఇది చూసి ఆర్భాటమేనా.. కొనుగోళ్లు లేవా అని పలువురు విమర్శిస్తున్నారు. – రేగిడి

లక్ష పసుపుకొమ్ముల నోము



లోక కల్యాణార్థం బొబ్బిలి శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో లక్ష పసుపుకొమ్ముల నోము, లక్ష్మీపూజలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణానికి చెందిన మహిళలు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని, సామూహిక లలితా సహస్ర పారాయణం చేశారు. కార్యక్రమంలో టీటీడీ ప్రాంతీయ సభ్యులు, ప్రవచన కర్త బి.గౌరీనరసింహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలి

జీడిమామిడి తోటల్లో సస్యరక్షణ తప్పనిసరి

రాజాం: జీడిమామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని ఉద్యానవన శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరాజులు సూచించారు. మండలంలోని గార్రాజుచీపురుపల్లి గ్రామంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో జీడిమామిడి రైతులకు తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ఒక్కరోజు శిక్షణా తరగతులు సోమవారం నిర్వహించారు. పువ్వు మొగ్గ దశలోనే చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలని, నీటిలో కరిగే గంధకం 2 గ్రాములు, ఎసిఫేట్ 1 గ్రాము, మల్టీకే 10 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పూత విచ్చుకోక ముందు తర్వాత దశల్లో పురుగు, తెగుళ్ల ఉధృతి ఉంటుందని, ఆ తెగుళ్ల తీవ్రత ఆధారంగా హెక్సాకోనోజోల్ రెండు మిల్లీలీటర్లు, దయామిథాక్సిన్‌తో కలిపి పురుగుమందును తగిన మోతాదులో పిచికారీ చేయాలన్నారు. తామరపురుగు, కాయమీద గోకినట్లుగా కనిపిస్తే ఫ్రిప్రోనిల్ 2 మిల్లీలీటర్లు గానీ, ఫెప్రోనిక్‌తో పాటు ఇమిడాక్లోప్రిడ్ కాంబినేషన్‌తో ఉన్న పురుగుమందును పిచికారీ చేయాలన్నారు.

ఉచితంగా 57 మొక్కలు..

జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఏవీఎస్ జమదగ్ని మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంట వేసుకునేందుకు తప్పనిసరిగా బోరు సదుపాయం ఉండాలని, నీటి సదుపాయం ఉన్న రైతులకు ఎకరానికి 57 మొక్కలు చొప్పున ఉచితంగా అందిస్తామన్నారు. అంతేకాకుండా నిర్వహణ కోసం హెక్టారు సాగులో రూ.5,250లు మొదటి మూడు సంవత్సరాల పాటు రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాస్త్రవేత్త శ్రీనివాసరాజులు


మొదటి మూడు సంవత్సరాలు ఈ పంటలో అంతర పంటగా మొక్కజొన్న, మినుములు, పెసలు, కూరగాయలు సాగుచేసుకునుటకు ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎస్.ధ్రువ, రాజాం మండల ఉద్యానవనశాఖాధికారి సీహెచ్ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక ఉద్యానవన శాఖ కార్యాలయంలో జీడిమామిడి తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. పంటకు పట్టే చీడపీడలు వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై ఉద్యానవన శాఖాధికారి ఎస్.వెంకటరత్నం అవగాహన కల్పించారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని కాశిందొరవలస గ్రామ రైతు సేవా కేంద్రంలో జీడిమామిడి తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి బి.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

బాడంగి: మండలంలోని డొంకినవలస గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సోమవారం సందర్శించారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే వారికి ఆటపాటలతో కూడిన విద్యనందించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందివ్వాల్సిన పౌష్టికాహారంక్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు.



చిన్నపిల్లల బరువు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో రామకృష్ణ